క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి శనివారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణీకులు తమ సమస్యలు, సూచనలు, సలహాలు 99592 25848 నెంబరుకు ఫోన్‌చేసిగానీ, వాట్సాప్ కాల్‌ద్వారాగానీ తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫోటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్‌లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువకులు శిక్షణకు అర్హులన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి 30రోజులపాటు ఈ శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గ్రామీణ యువకులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని, వివరాలకు 94409 05478, 99856 06866 నెంబరులో సంప్రదించాలన్నారు.

రుణాలు ఇవ్వాలి



చర్చా వేదికలో మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప సెవెన్‌రోడ్స్ : బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా ఈ ఆర్థిక సంవత్సరపు రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ ఎస్టీలకు కార్పొరేషన్ల ద్వారా 85 శాతంతో సబ్సిడీ లోన్లు ఇవ్వాలని ఏపీ దళిత మిత్ర సంఘం అధ్యక్షులు కైపు రామాంజనేయులు డిమాండ్ చేశారు. దళితమిత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన చర్చావేదికలో ఆయన మాట్లాడారు. డైరెక్ట్ రుణాలతోపాటు ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల ప్రభుత్వ భూమి మంజూరు చేయాలని కోరారు. ఇందువల్ల దళితుల జీవన స్థాయి మారుతుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ నాయకులు అవ్వారు మల్లికార్జున, బీఎస్పీ నాయకులు సగిలి గుర్రప్ప, హ్యూమన్ రైట్స్ కన్వీనర్‌జేవీ రమణ, సీపీఐ (ఎంఎల్) నాయకులు బందెల ఓబయ్య, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు పుల్లయ్య, మాలమహానాడు నాయకుడు వినోద్, దళితమిత్ర జిల్లా అధ్యక్షులు కె.బాబు, ప్రవీణ్, ఎమ్మార్పీ అధ్యక్షులు సంగటి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

కడప వైఎస్ఆర్ సర్కిల్: సమాజ అభివృద్ధికి రైతుల సంక్షేమమే ప్రాధాన్యతగా తీసుకుని, వారికి మౌలిక సదుపాయాలు అందించి ఆర్థికంగా ఎదిగేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కడప పార్లమెంట్ పరిధిలోని బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, కడప, కమలాపురం, జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గాలలో వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారం, పశువులకు మేత అందుబాటులోకి తేవడం, అలాగే రైతులకు లబ్ధి చేకూర్చే పలు ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రజ్ఞా వికాస్ పరీక్షలను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ షంషుద్దీన్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 25న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ప్రజ్ఞా వికాస్ పరీక్షలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో డీఈవో కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ప్రజ్ఞ వికాస్ కరపత్రాలను డీఈఓ షంషుద్దీన్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులలో పరీక్ష భయాన్ని పోగొట్టడం కోసం పదవ తరగతి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగానే ఈ సంవత్సరం ఫిబ్రవరి 25 న కూడా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ఎగ్జామ్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులలో అవగాహన కల్పించడం కోసం పబ్లిక్ పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టడం కోసం ఈ పరీక్షలను ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 10వ తరగతి సిలబస్ ఆధారితంగానే ప్రశ్నాపత్రం ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు.

ఎన్నికల హామీలు అమలు చేయరా..?


- కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక తన కార్యాలయంలో కడప నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను వేధించడానికి, దాడులు దౌర్జన్యాలు చేయడానికి పెట్టిన శ్రద్ధ, మేనిఫెస్టో హామీలు అమలు చేయడంలో పెట్టడం లేదని తెలిపారు. అనుబంధ సంఘాల అధ్యక్షులుగా ఎంపికైన వారు వెంటనే తమ కమిటీలను పూర్తి చేయాలన్నారు. క్రమశిక్షణతో కష్టపడి పని చేసే వారిని కమిటీలలో వేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా వైఎస్ఆర్‌సీపీని విజయపథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఐస్‌క్రీమ్ రవి, బాలస్వామి రెడ్డి, నాగేంద్రరెడ్డి,షఫీ పాల్గొన్నారు.

పొదుపు నైపుణ్యాలు ఆదాయ ప్రగతికి మార్గాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఎస్.రఘునాథ్ రెడ్డి

కడప ఎడ్యుకేషన్: వ్యక్తిగత ఆర్థిక ప్రణాళిక, పొదుపు నైపుణ్యాలు ఆదాయ ప్రగతికి మార్గాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్. రఘునాథ రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎన్.ఎస్.ఎస్ యూనిట్-1 , సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్.ఇ.బి.ఐ) సంయుక్త ఆధ్వర్యంలో 'ఫైనాన్షియల్ లిటరసీ- ఏ వే ఫర్ పర్సనల్ ఫైనాన్షియల్ ఎంపవర్మెంట్ టు స్టాక్ ఇన్వెస్టిమెంట్స్' అనే అంశంపై శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సెల్ నివేదికతో నెలవారీ బడ్జెట్‌ను ఎలా తయారు చేయాలో చూపించారు. ఉత్తమ పోర్ట్‌ఫోలియోలో స్టాక్ పెట్టుబడులలో అవకాశాలు, సవాళ్లను వివరించారు. స్టాక్ మార్కెట్లో ఉత్తమ పోర్ట్‌ఫోలియోను ఎంచుకోవడానికి విశ్లేషణాత్మక నైపుణ్యాలు మరింత అవసరమన్నారు. సంపాదనను పొదుపు వైపు మళ్లించి వివిధ పథకాల్లో పెట్టుబడుల ద్వారా వ్యక్తుల ఆర్థిక స్థితి మెరుగయ్యి సాధికారత దిశగా వెళతారన్నారు. అలానే సమాజం ఆర్థిక స్థిరత్వాన్ని పొందుతుందన్నారు. బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి సరిత మాట్లాడుతూ వర్క్‌షాప్ ఇతివృత్తం, వివిధ పోర్ట్‌ఫోలియోలలోని పెట్టుబడిదారులకు సంబంధించిన భవిష్యత్తు ప్రణాళికల గురించి వివరించారు. ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్యులు సైతం డబ్బును ఆదా చేయడం, షేర్లలో పెట్టుబడి పెట్టడం ప్రయోజనకరమన్నారు. సెబీ ట్రైనర్ శ్రీనివాసరావు ఆర్థిక వనరులపై విస్తృతమైన ఉపన్యాసం ఇచ్చారు. ఆచార్య వై. సుబ్బరాయుడు పెట్టుబడి ప్రణాళిక గురించి వివరించారు. ప్రయోజనకరమైన కార్యక్రమాన్ని నిర్వహించిన వైవీయు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఎన్. వెంకటరామి రెడ్డి , విభాగాధిపతి పి. సరిత, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ బి గంగయ్యను అభినందించారు. ఈ వర్క్‌షాప్‌లో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థికి బహుమతి ప్రకటించారు. డాక్టర్ పివి వరప్రభాకర్, అధ్యాపకులు అనిల్ దేవ కుమార్, రాజశేఖర్, వెంకట రమణయ్య, సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో నియామకాలు చేపట్టాలి



కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను సత్వరమే భర్తీ చేయాలని జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ఉన్న కెనరా బ్యాంకు కార్యాలయ ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు దేశంలోని అన్ని ప్రధాన నగరాలలో జిల్లా కేంద్రాలలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. వారంలో ఐదు రోజుల పనిదినాలుగా నిర్ణయించాలన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ఆపాలని, ఐడీబీఐ బ్యాంకును ప్రైవేటీకరణ చేయరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ డిమాండ్లను సాధించే క్రమంలో మార్చి 24, 25 తేదీలలో రెండురోజులు దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆఫీసు బేరర్స్ రాజశేఖర్ కిరణ్ (ఎస్‌బీఐ), ఆఫీసర్స్ రీజినల్ సెక్రటరీ (ఎస్‌బీఐ) రాంప్రసాద్‌రెడ్డి, యూబీఐ హర్షవర్ధన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ భరద్వాజ్, ఎల్ఐసీ యూనియన్ నాయకులు రఘునాథరెడ్డి, అవధానం శ్రీనివాసులు, అన్ని బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్షణ లేకుంటే ఆలయాల మనుగడ ఎలా..?



మాట్లాడుతున్న జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు

కడప కల్చరల్: నిత్యం దేవాలయాలలో దేవతామూర్తుల సేవలో గడిపే అర్చకులకు రక్షణ లేకుంటే ఆలయాలు ఎలా మనుగడ సాగిస్తాయని జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక బ్రాహ్మణవీధిలోని సంస్థ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అర్చకులపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉందని, గొప్ప ఆధ్యాత్మికవేత్తగా ప్రభుత్వ జోక్యం లేకుండా ఆలయాన్ని ఎలాంటి వివాదం లేకుండా నిర్వహిస్తున్న చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకు, ఆయనపై భౌతిక దాడులకు పాల్పడటం దారుణమన్నారు. ప్రభుత్వం అర్చకులకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలని కోరారు. 2014 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ ఎస్టీ బీసీ కాలనీల్లోని పెండింగ్‌లో ఉన్న సీజీఎఫ్ నూతన ఆలయాలను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని శ్రీ పుష్పగిరి తీర్థ క్షేత్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు భారవి కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శివసత్యకుమార్ శర్మ, కొప్పర్తి రవి, వరప్రసాద్‌శర్మ, ఇంద్రగంటి ప్రభాకర్‌శర్మ, మురళి జగన్నాథశర్మ, ప్రదీప్ శర్మ, మల్లికార్జున స్వామి, సుబ్బయ్య స్వామి, మధు, రాజేష్, మోహన్, సునీల్, సుధీర్, కిరణ్, రాఘవ, మల్లికార్జునలు పాల్గొన్నారు.

హర్షం – మహాకుంభమేళా కనివినీ ఎరుగని రీతిలో విజయవంతం కావడం పట్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఇది భారతీయ సనాతన ధర్మానికిగల ఆదరణకు ప్రతీక అన్నారు.

తెలుగు వికాసానికే సాహితీ యాత్రలు



మాతృ భాషాభిమానులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : మన మాతృభాష తెలుగు సంపూర్ణ వికాసానికే జిల్లా అంతటా సాహితీ యాత్రలను, మొల్ల జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. శుక్రవారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో మొల్లకు పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషలో చదువుకున్న దేశాలన్నీ ఆర్థికంగా, సామాజికంగా, సాంకేతికంగా కూడా ఉన్నత స్థాయిలో ఉన్నాయని తెలిపారు. తెలుగు ఖ్యాతిని, భాషా పరిణామ చరిత్రను చాటుతున్న కలమల్ల, ఎర్రగుడిపాడులోని తొలి, మలి తెలుగు శాసనాలు లభించిన జిల్లాలో ప్రజలకు మాతృభాష ఔన్నత్యం, సంస్కృతి సంప్రదాయాలుగురించి అవగాహన కల్పించేందుకు సాహితీ యాత్రలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొల్లమాంబ జయంతి రోజు నుంచి ఆమె జన్మస్థలి గోపవరంలో ఈ యాత్రలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాతృభాషాభిమానులు రామమూర్తి నాయుడు, మలిశెట్టి జానకిరాం, అలపర్తి పిచ్చయ్య చౌదరి, కోడూరు సుమన, శివ శ్రీశర్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వి.నాగమునిరెడ్డి, నూనె నగేష్, కల్లూరు బాల ఎల్లారెడ్డి, తుపాకుల నారాయణ , పెండ్లిమర్రి మల్లయ్య, నాగయ్య, చెంచిరెడ్డి, సుబ్బరాయుడు, సత్యరాజు తదితరులు కూడా పాల్గొని ప్రసంగించారు.

ప్రాంతీయ మహాసభలు జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప హరిత ఫంక్షన్ హాల్లో శనివారం నుంచి నిర్వహించనున్న రాయలసీమ నెల్లూరు ప్రకాశం జిల్లాల ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగా, రాజోలి, వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడం మూలంగా నికర జలాలను కోల్పోవలసి వచ్చిందన్నారు. మిగులు జలాలను వాడుకునే వెసులుబాటును కాలరాస్తూ ట్రిబునల్ ఇచ్చిన తీర్పు రాయలసీమ పాలిట మరణ శాసనంగా మారిందన్నారు. హక్కులు అవకాశాలను కోల్పోయిన రాయలసీమ నెల్లూరు ప్రకాశం జిల్లాలు మరోమారు నష్టపోకుండా ఉండేందుకు నీటిపారుదల ప్రాజెక్టుల స్థితి, నీటి కేటాయింపులు, నీటి వివాదాలు పరిష్కార మార్గాలు పాలక ప్రభుత్వాలు భవిష్యత్తు కార్యాచరణపై జరుగు ప్రాజెక్టుల మహాసభకు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, నీటిపారుదల రంగ నిపుణులు ఈ. లక్ష్మీనారాయణ బొజ్జ దశరథరామిరెడ్డి , డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, జి ఓబులేసు, 100 టి.ఎం.సి రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర నగర కార్యదర్శి ఎన్ వెంకట శివ సహాయ కార్యదర్శి కేసి బాదుల్లా పాల్గొన్నారు.

డైరీ ఎంతో ఉపయుక్తం



డైరీ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష



జీసీటీఏ డైరీ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్: కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ సలీంబాష తమ అధ్యాపకులతో కలిసి గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్(జీసీటీఏ) డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డైరీ అధ్యాపకులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీసీటీఏ నాయకులు డాక్టర్ శశికాంత్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణవేణి, జీసీటీఏ సభ్యులు డాక్టర్ విజయలక్ష్మిదేవి, డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ షాజియాబేగం, డాక్టర్ సర్వాప పాల్గొన్నారు.

ప్రభుత్వ పురుషుల కళాశాలలో...

కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో కూడా గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్(జీసీటీఏ) డైరీని ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ , వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఏఓ వెంకటరమణలు అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీసీటీఏ జిల్లా ప్రెసిడెంట్ తాతినేని శశికాంత్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

23న నగరంలో శోభాయాత్ర

కడప కల్చరల్ : కడప నగరంలోని మృత్యుంజయకుంట శివాలయం నుంచి ఆదివారం ఉదయం మహాదేవుని శోభాయాత్ర నిర్వహించనున్నామని కార్యక్రమ కన్వీనర్ విజయానందరెడ్డి తెలిపారు. జిల్లా అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు పిడతల గోపాలకృష్ణశర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌శర్మ, గౌరవ అధ్యక్షులు చంద్రమౌళిశర్మల ఆధ్వర్యంలో శుక్రవారం మృత్యుంజకుంట శివాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుంభమేళా అద్భుతమైన విజయాన్ని అందుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని, మహాశివరాత్రి ముందు మహాదేవుని పేరిట జరిగిన కుంభమేళా తమకెంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఆ స్ఫూర్తితో అక్కడి నుంచి సేకరించి తెచ్చిన పవిత్ర జలాలను కడప నగరంలోని ప్రజలందరికీ ఆ పుణ్యఫలం దక్కేలా నగరంలోని ప్రజలపై సంప్రోక్షన చేస్తూ నగర వీధుల్లో శోభాయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు జగదీష్, డాక్టర్ శంకర్‌రెడ్డి, సోమకళానాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, సంజీవరెడ్డి, దేవేంద్రబాబు, నవనీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు



కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహావీర్ సర్కిల్ సమీపంలో పిఎఫ్ కార్యాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి (58) అనారోగ్యంతో మృతి చెందాడు. కడప ఒన్‌టౌన్ సీఐ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో మృతుని ఆచూకీ కోసం విచారించారు. దొరకకపోవడంతో మేము సైతం సేవాసంస్థ సభ్యుల ఆధ్వర్యంలో మోచంపేటలోని హిందూస్మశాన వాటికలో ఆ వ్యక్తికి అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంకధారిరాము, అయ్యవారయ్య, కిషోర్, రామలోకం, షామియానా సురేష్, రామరాజు, శివరాం, పుల్లయ్య, ఒన్‌టౌన్ ఏఎస్ఐ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కడప అర్బన్: బెంగుళూరు నగర వాస్తవ్యులు ఉమాసింగ్ మనువడు ఆది ఉమాసింగ్ పుట్టినరోజు సందర్భంగా అతని నాన్న వినోద్ ఉమాసింగ్ హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల నివాస వసతిగృహంలో అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో హిమవర్షిణి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, వెంకటసురేష్‌బాబు, దామోదర్, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరాలయంలో హోమం

సిద్దవటం: మండలంలోని కనుమలోపల్లె ఉమాదేవి సహిత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం హోమం నిర్వహించారు. జీర్ణోద్ధరణ పూర్వక పునఃఆలయ ప్రతిష్ఠ, నీలకంఠేశ్వర మరకత లింగేశ్వరస్వామి, పంచముఖ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, జీవధ్వజం, శిఖరం, సూర్యనారాయణ స్వామి విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా పూజలు నిర్వంచామని వేద పండితులు చైతన్యశర్మ తెలిపారు. ఉదయం నిత్యపూజ, క్షీరాధివాసం, అదివాసాంగ, పంచసూక్త హోమాలు, తీర్థ ప్రసాదల వితరణ పూజలు జరిపారు. సాయంత్రం వేదికార్చన, బలిహరణ, ధాన్యాధివాసం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సోమబాబు, మల్లేశ్వరరెడ్డి, లలిత్‌శర్మ, కిరణ్, క్రిష్ణయ్య, అచ్యుత్, సురేంద్ర పాల్గొన్నారు.

ఇంటింటా న్యాయ ప్రచారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 6279 గృహాలను సందర్శించి 85 మంది ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను గుర్తించినట్లు వైద్య బృందం తెలియజేసింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి సెక్రటరీ, సీనియర్‌సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటా న్యాయ ప్రచారాన్ని నిర్వహించామన్నారు. పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు పుట్టుకతోవచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి నివారణ కోసం ఇంటింటా న్యాయ ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 46 బృందాలను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అర్హులను గుర్తిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యాధికారులు, భవిత సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత మాట్లాడుతూ ఫీవర్ సర్వే, దోమల లార్వా సర్వేలపై తనిఖీలు నిర్వహించి లార్వాలను గుర్తించి వాటిని తొలగించాలని సూచించారు. దోమల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జ్వరాలు రాకుండా ఉండాలంటే దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాల్లో మురికి నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఏవైనా పనికిరాని వస్తువులు, పగిలిన కుండలు, పాత టైర్లు, టెంకాయల చిప్పలు, ప్లాస్టిక్ కప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుబ్బరాయుడు, నారాయణ, ట్రైనీ వైద్యులు డాక్టర్ నీరజ, డాక్టర్ వెంకటసాయి మేఘన, డాక్టర్ శర్వారి, ఏఎన్ఎం సుమలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవుడు ప్రేమ స్వరూపుడు



దైవ సందేశం అందజేస్తున్న ప్రేమదాస్

కడప కోటిరెడ్డి సర్కిల్/కల్చరల్ : ఏసుక్రీస్తు ప్రభువు ప్రేమ స్వరూపుడు అని తుని ప్రేమ స్వరూపి మినిస్ట్రీస్ డైరెక్టర్ ప్రేమదాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం హరిత బాక్వెంట్ హాలులో విడుదల స్వస్థత ఆశీర్వాద కూడిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మారు మనసు పొంది పాప క్షమాపణ కలిగినపుడే దేవుడు క్షమిస్తాడని తెలిపారు. ఏసు ప్రభువు సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు. దైవసేవకులు లిల్లి , ప్రేమ్‌కుమార్, ప్రశాంత్ స్తుతి ఆరాధన చేశారు. పాలగిరి మంజులాదేవి, భానుప్రకాశ్, మేరి దివ్యకళ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



డీఆర్ఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంతోపాటు తల్లికి వందనం పథకాన్ని తక్షణం అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడును పీడీఎస్‌యూ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ పరంగా పలు సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ వసతి గృహాల్లో మెస్, కాస్మొటిక్ చార్జీలు కూడా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పీడీఎస్‌యూ నాయకులు సల్మాన్, ఆనంద్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై శిక్షణ



అవగాహన సదస్సులో నమూనాలు పరిశీలిస్తున్న అధికారులు



అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో వ్యాధుల సంక్రమణ, నివారణపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. హైదరాబాద్ ఐఐహెచ్ వారిచే ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో వ్యాధుల సంక్రమణ, నివారణ, నియంత్రణపై ఈనెల 17 వ తేదీ నుంచి 22 వరకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారని.. వారికి వృత్తి నైపుణ్యాలను పెంచుకోవడంతో, రోగులకు అత్యుత్తమైన ఆరోగ్యసేవలను అందించడంలో అవగాహన కల్పించామన్నారు.

ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ రాజేశ్వరి, మైక్రోబయాలజీ హెచ్ఓడీ డాక్టర్ బి. నాగశ్రీలత, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓలు డాక్టర్లు లిల్లీ సునీత, వి.గీత, డాక్టర్ నాగలక్ష్మి, నర్సింగ్, స్టాఫ్, పారా, మెడికల్ సిబ్బందితో పాటు, శానిటేషన్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.